# అంతటా వర్షం.. అన్నదాతల హర్షం


కూసుమంచి : పాలేరులో కరిగట్టు చేస్తున్న రైతు


వర్షంలో మేకలు, గొర్రెల కాపరులు


ముదిగొండ : దుక్కుల్లో నిలిచిన నీరు


పెనుబల్లి : కరివేద సాగుకు మందు చల్లుతున్న రైతు


వైరా రూరల్ : ట్రాఫిక్ నిలిచిపోయిన దృశ్యం


జీలుగులు తీసుకెళ్తున్న రైతులు

కూసుమంచి, జూన్ 30: రెండు రోజుల నుంచి అంతటా వర్షాలు పడుతుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. శనివారం అర్ధరాత్రి మోస్తరు నుంచి భారీ వర్షం పడడంతో తొలకరి పంటలు వేసిన రైతులకు ఉపశమనం లభించింది. ఇప్పటికే వరి వేయాలనుకున్న రైతులు జీలుగులు, జనుములు, పిల్లిపెసర వంటి పచ్చి రొట్ట విత్తనాలు వేశారు. పత్తి, వేరుశనగ, పెసర, మక్క, కంది తదితర పంటల సాగుకు ఈ వర్షాలు అనుకూలిస్తాయి. మిర్చి రైతులు నారు పోసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికే విత్తనాలు పెట్టిన రైతులకు ఈ వర్షం బాగా ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి అన్నారు.

**ముదిగొండ మండలంలో..**

ముదిగొండ, జూన్ 30: మండలవ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. సాగు పనులు మొదలై నెల రోజులవుతున్నా సరైన వర్షం లేకపోవడంతో నిరాశగా ఉన్న రైతులు ఈ వర్షంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు. సాగు పనులు మరింత జోరందుకోనున్నాయి.

**పెనుబల్లి మండలంలో..**

పెనుబల్లి, జూన్ 30: మండలంలో వర్షాలు పడుతుండంతో కరివేద సాగు వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. 15 రోజుల క్రితం చల్లిన వడ్లకు మొలకలు వచ్చాయి. ఇవి త్వరగా ఏపుగా పెరిగేలా మందు చల్లేందుకు సిద్ధమవుతున్నారు.

**తిరుమలాయపాలెం మండలంలో..**

తిరుమలాయపాలెం, జూన్ 30: మండలవ్యాప్తంగా ఆదివారం వర్షం కురిసింది. ఖరీఫ్ పంటలకు ఇది మేలు చేస్తుందని రైతులు చెబుతున్నారు.

## అధునాతన వసతులతో 'స్తంభాద్రి' హాస్పిటల్

### ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్సీ తాతా మధు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల

ఖమ్మం సిటీ, జూన్ 30: అత్యాధునిక సాంకేతికత, అత్యున్నత నిపుణుల వైద్యం, మెరుగైన వైద్యసేవలు అందించేందుకు స్తంభాద్రి హాస్పిటల్‌ను నెలకొల్పడం అభినందనీయమని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. నగరంలోని నెహ్రూనగర్ ప్రాంతంలో విశాలమైన భవన సముదాయం, సర్వాంగ సుందరంగా ఏర్పాటు చేసిన స్తంభాద్రి ఆసుపత్రిని ఆదివారం రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ తాతా మధు, సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. నగరం నడిబొడ్డున ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లోని సామాన్య ప్రజల కోసం సకల సౌకర్యాలు కలిగిన హాస్పిటల్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. మెట్రో పాలిటన్ నగరాలకు దీటుగా అడ్వాన్స్‌డ్ వైద్యాన్ని పరిచయం చేస్తున్నారంటూ స్తంభాద్రి యాజమాన్యాన్ని అభినందించారు. దశాబ్దకాలం అనుభవం కలిగిన డాక్టర్లు, ఐదురకాల ప్రత్యేక (స్పెషలైజేషన్) వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలని ఆయన సూచించారు. అనంతరం స్తంభాద్రి వైద్యుల బృందం న్యూరో సర్జన్ డాక్టర్ గట్టినేని సురేషన్, ఆర్థోపెడిక్ డాక్టర్ మేదరమెట్ల అనిల్‌కుమార్, యూరాలజిస్ట్ డాక్టర్ గుమ్మడి రాఘవేంద్ర, కార్డియాలజిస్ట్ డాక్టర్ హర్షతేజ పేర్ల, ఎండీ జనరల్ మెడిసిన్ డాక్టర్ డోగిపర్తి కృష్ణ సుమంత్ వారి స్తంభాద్రి హాస్పిటల్ ప్రత్యేకతలను వివరించారు. అరవై వేల చదరపు అడుగుల సువిశాల భవనం, 130 పడకల సామర్థ్యంతో హాస్పిటల్‌ను నెలకొల్పామన్నారు. అత్యాధునిక క్యాథ్‌లాబ్, సిటీ స్కాన్ సౌకర్యం కూడా ఉన్నదని అన్నివర్గాల ప్రజలు తమ సేవలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మినారాయణ, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, వైరా మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, సీపీఐ, సీపీఎం రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, పోతినేని సుదర్శన్‌రావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ మాలతి, ఐఎంఏ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ కంభంపాటి నారాయణరావు, సెక్రెటరీ డాక్టర్ జగదీష్, ట్రెజరర్ డాక్టర్ స్వప్న పాల్గొన్నారు.

## 'టీం ఇండియా'కు అభినందన


లచ్చగూడెంలో ర్యాలీ చేస్తున్న యువకులు


పెనుబల్లి : పటాకులు పేల్చి కేరింతలు కొడుతున్న యువకులు

సత్తుపల్లి, జూన్ 30: టీ20 క్రికెట్‌లో దక్షిణాఫ్రికాపై అద్భుత విజయం సాధించిన టీం ఇండియాకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆదివారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పంతో సమష్టిగా శ్రమిస్తే విజయం సాధించవచ్చనడానికి ఇదొక చక్కటి ఉదాహరణని పేర్కొన్నారు.

చింతకాని, మార్చి 20: టీం ఇండియా గెలుపుతో మండలంలచ్చగూడెం గ్రామంలో క్రికెట్ అభిమానులు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ కూడలిలో బాణాసంచా కాల్చారు.

పెనుబల్లి, జూన్ 30: దక్షిణాఫ్రికాపై టీం ఇండియా అద్భుత విజయంతో కల్లూరులో యువకులు శనివారం రాత్రి సంబురాలు చేసుకున్నారు. బాణాసంచా కాలుస్తూ కేరింతలు కొట్టారు.

**ప్రకటన**

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మధిర బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **కుంజ కళ్యాణ్** S/o: **వెంకటేష్, వయస్సు : 35**సం||లు, **నివాసం:** నిదానపురం గ్రామం, మధిర మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు.కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **3** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి:** ఖమ్మం జిల్లా, మధిర సబ్ రిజిస్ట్రార్ వారి పరధి మధిర మండలం, నిదానపురం గ్రామపంచాయితీ, నిధానపురం గ్రామంలోగల 225 చ||గ|| విస్తీర్ణముగా గల స్థిరాస్థి నివేశన స్థలము మరియు ఇట్టిస్థలములో గల ఇంటి నెం. 5-52 (అసెస్మెంట్ నెం.452) గా గల ఇంటి యొక్క ఆర్‌సిసిసి కట్టుబడి విస్తీర్ణము : 288 చ||అ||, **డాక్యుమెంట్ నెం. 1259/2024,** ఎసిసి కట్టుబడి విస్తీర్ణము : 294 చ||అ|| టాయిలెట్స్ ఆర్‌సి కట్టుబడి విస్తీర్ణము : 40 చ||అ|| ఇట్టి ఇంటికి గల కట్టుబడులు వగైరాలతో సహా గల ఆస్తికి హద్దులు :**తూర్పు** : వేము తేరోజమ్మ గారి ఇల్లు, **దక్షిణము** : వేము కరుణాకర్ గారి ఇల్లు, **పడమర** : గ్రామపంచాయితీ రోడ్డు, **ఉత్తరము** : గ్రామపంచాయితీ రోడ్డు.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

## ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు

### ఇద్దరికి తీవ్ర, ఆరుగురికి స్వల్ప గాయాలు

### పరారీలో బస్సు డ్రైవర్


ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొట్టిన దృశ్యం

సత్తుపల్లి టౌన్, జూన్ 30: సత్తుపల్లి మండలం కిష్టారం వై-జంక్షన్ సమీపంలో ఆదివారం లారీ ట్యాంకర్‌ను ఆర్టీసీ అద్దె బస్సు ఢీకొంది. ఇద్దరికి తీవ్రంగా, ఆరుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఖమ్మం నుంచి రాజమండ్రి వైపు ఆర్టీసీ అద్దె బస్సు వెళ్తున్నది. ఏపీలోని జంగారెడ్డిగూడెం నుంచి పామాయిల్ లోడ్‌తో నాగాలాండ్‌కు ట్యాంకర్ వెళ్తున్నది. వై-జంక్షన్ సమీపంలో లారీని ఆర్టీసీ అద్దె బస్సు ఓవర్ టేక్ చేస్తున్నది. ఈ క్రమంలోనే, లారీ వెనుకగా వస్తున్న పామాయిల్ ట్యాంకర్‌ను ఈ బస్సు బలంగా ఢీకొంది. రాజస్థాన్‌కు చెందిన ట్యాంకర్ డ్రైవర్ కౌల్‌రామ్(26)కు, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ ఖమ్మం డిపోకు చెందిన ఎస్ఎం సత్తిరెడ్డికి, బస్సులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద స్థలాన్ని ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వర్షపు నీరు ఇలా.. స్కూల్ కి వెళ్లేదెలా..

### వర్షపునీటితో విద్యార్థుల అవస్థలు


రహదారిపై నిలచిన నీరు


నిలిచిన నీటితో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

చింతకాని, జూన్ 30: మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. ఉన్నత, ప్రాథమిక, అంగన్‌వాడీ పాఠశాలల ముందే వర్షపు నీరు నిలవడంతో చెరువును తలపిస్తున్నది. శనివారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి సమీప ఇళ్లల్లోని వర్షపునీరు రహదారిపై చేరుకుంది. దీంతో పాఠశాలల విద్యార్థులు నీటిని దాటుకుంటూ పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్‌అండ్‌బీ, పంచాయతీ అధికారులు, సిబ్బంది రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూసి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, విద్యార్థులు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

**CHANGE OF NAME**

*I, **AYULURI CHINABASWI REDDY**, CHANGED MY NAME AS **AYULURI CHINNABASVI REDDY** S/O. AYULURI SESHI REDDY, R/O. H NO.7-57, KURNAVALLI, TALLADA, KHAMMAM DIST- 507167
KMM

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం


రాజారావు దంపతులను సన్మానిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం, జూన్ 30: మండలంలోని చొప్పకట్లపాలెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, టీఎస్ యూటీఎఫ్ సీనియర్ నాయకుడు బండారుపల్లి రాజారావు ఉద్యోగం విరమించారు. రాజారావు దంపతులను పాఠశాలలో జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు సన్మానించారు. సహ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావా రవి, జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, కార్యదర్శి నాగూర్‌వలి, ఎంఈవో ప్రభాకర్, ఎర్రుపాలెం మండల అధ్యక్ష, కార్యదర్శులు అనుమోలు కోటేశ్వరరావు, బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తుల రద్దీ


పెద్దమ్మతల్లి అమ్మవారు, దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచ, జూన్ 30 : మండలంలోని కేశవాపురం- జగన్నాథపురం గ్రామాల మధ్యలో వెలిసిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని ఆదివారం భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం రోజంతా వర్షం కురుస్తూనే ఉన్నా కానీ భక్తుల రద్దీ మాత్రం తగ్గలేదు. జోరువానలో సైతం భక్తిభావం తగ్గలేదు. ఆలయ పరిసర ప్రాంతాలు మొత్తం భక్తులతో కిటకిటలాడాయి. కేటీపీఎస్‌కు చెందిన 41మంది ఉద్యోగ విరమణ పొందడంతో వారంతా అమ్మవారిని దర్శించుకునేందుకు రావడంతో రద్దీ మరింత పెరిగింది.


మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

### పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు


మధిర- బోనకల్లు రోడ్డులో ఎండిపోయిన వృక్షాలు

మధిర, జూన్ 30: మధిర- వైరా, బోనకల్లు- వైరా, ఖమ్మం- బోనకల్లు ప్రధాన రోడ్డు మార్గంలో పెద్దపెద్ద వృక్షాలు ఎండిపోయి ప్రమాదాలకు నిలయంగా మారాయి. రోడ్డుపక్కన ఉన్న వృక్షాలు గాలి దుమారాలకు పడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం వీటిని తొలగించడంలో నిర్లక్ష్యం వ్యవహరించడంతో వాహనదారులు స్థానికుల సహకారంతో పడిపోయిన చెట్లను తొలగిస్తున్నారు. ఎండిపోయిన చెట్లు ఎక్కడ మీద పడిపోతాయోనని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మధిర డివిజన్, ఖమ్మం డివిజన్ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఎండిపోయిన చెట్లను వెంటనే తొలగించి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

## పాలేరుకు వరద..


పాలేరు రిజర్వాయర్‌కు వస్తున్న వరద

కూసుమంచి, జూన్ 30: ఐదు జిల్లాలకు తాగు నీరు, ఖమ్మం జిల్లాలోని 17 మండలాలకు సాగు నీరు అందించే పాలేరు రిజర్వాయర్‌కు వరద నీరు చేరుతున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వర్షాలు పడుతుండటంతో మున్నేరు, ఆకేరుకు నీటి ప్రవాహం పెరుగుతున్నది. మరిపెడ బంగ్లా, దంతాలపల్లి, పెదవంగర, మహబూబాబాద్‌లలో పడిన వర్షాలతో పాలేరు వాగు ద్వారా (పాలేరు) రిజర్వాయర్‌కు వరద వస్తున్నది. శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు సుమారు 200 క్యూసెక్కుల వరకు చేరుతుందని; ఇది సోమ, మంగళవారాల్లో మరింతగా పెరగవచ్చని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. గత ఆరు నెలలుగా పాలేరు రిజర్వార్‌లో నీటి కోసం జిల్లా ప్రజానీకం ఎదురు చూస్తున్నది. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒక దశలో తాగునీటిని కూడా సరఫరా చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పడుతున్న వర్షాలతో ఇప్పుడిప్పుడే వరద నీరు చేరుతున్నది. పాలేరు పూర్తిస్థాయి నీటి మట్టం 23 అడుగులు, 2.588 టీఎంసీలు. ప్రస్తుత నీటి మట్టం 8 అడుగులు మాత్రమే ఉంది. నీటి మట్టం క్రమంగా పెరిగే అవకాశాలున్నాయి.

## అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

మధిర రూరల్, జూన్ 30: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల్లో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హతలున్న వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. జూలై 2వ తేదీ సాయంత్రం 4.00 గంటల వరకు దరఖాస్తులను స్వాకరించనున్నట్లు, జూలై 4న ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు.

## 'మీల్స్ ఆన్ వీల్స్' కొనసాగింపు

సత్తుపల్లి టౌన్, జూన్ 30: సత్తుపల్లిలో 'మీల్స్ ఆన్ వీల్స్'ను కొనసాగించాలని నిర్ణయించినట్లు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ శివప్రసాద్ ప్రకటించారు. స్థానిక కళాభారతిలో దొడ్డా కృష్ణయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన లయన్స్ క్లబ్ 31 చార్టర్ నైట్ వేడుకలో ఆయన మాట్లాడుతూ.. 'మీల్స్ ఆన్ వీల్స్'ను సత్తుపల్లిలో 220 రోజులపాటు నిర్వహించామన్నారు. పేదల కోరిక మేరకు దీనిని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. క్లబ్ నూతన కమిటీని ఈ వేడుకలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెనుగొండ రమేష్, ప్రధాన కార్యదర్శిగా దాసరి ఉమామహేశ్వరరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా సింగరేణి రవి ఎన్నికయ్యారు, క్లబ్ పీడీజీ కాపా మురళీకృష్ణ, బాధ్యులు పెనుగొండ రమేష్, గుండు శ్రీనివాసరావు, కొత్తూరు ప్రభాకర్‌రావు, దారా కృష్ణారావు, గండ్ర సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణమ్మకు నివాళి

సత్తుపల్లి టౌన్, జూన్ 30: మండలంలోని కాకర్లపల్లి గ్రామస్తురాలు సంపూర్ణమ్మ ఇటీవల మృతిచెందారు. ఆమె కుటుంబీకులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆదివారం పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను సానుభూతి తెలిపారు.

## 4న దొడ్డి కొమరయ్య వర్ధంతి సభ

తిరుమలాయపాలెం, జూన్ 30: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతి సభను వచ్చే నెల 4న ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శి ఎం.రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని బచ్చోడులో ఆదివారం పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్, నాయకులు వీరస్వామి, నగేష్, శ్రీను, భిక్షం, వెంకన్న, ఉపేందర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన అధ్యక్షుడిగా బాసునాయక్

తిరుమలాయపాలెం, జూన్ 30: సేవాలాల్ సేన మండల అధ్యక్షుడిగా ఇస్లావత్ బాసునాయక్(బావ్‌సింగ్)ను కుక్కలతండాలో ఆదివారం జరిగిన సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రైతు కమిటీ మండల అధ్యక్షుడిగా గుగులోత్ చిన్నా ఎన్నికయ్యారు. నాయకులు కిషన్ నాయక్, శ్రీకాంత్ నాయక్, బి,భద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ 'రైతు భరోసా': మువ్వా

పెనుబల్లి, జూన్ 30: రైతు భరోసా పథకాన్ని అర్హులందరికీ అందిస్తామని సొసైటీ చైర్మన్, టీఎస్‌ఐడబ్ల్యూడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు తెలిపారు. పెనుబల్లి సొసైటీలో రైతులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పథకం విధి విధానాలపై రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో పాస్ బుక్ లేని రైతులకు పహణీ నకళ్ల మీద రైతు భరోసా అందించాలని కొందరు కోరారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారిస్తుందని విజయబాబు చెప్పారు. సీఈవో అరవపల్లి చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

## షఫీకి పెందోట బాలసాహిత్య పురస్కారం


సాహిత్య పురస్కారం అందుకున్న షఫీ

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 30 : ఖమ్మం నగరంలోని మోమినాన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న షఫీకి 'ఖమ్మం జిల్లా కథల పల్లకి' పుస్తకానికి సంపాదకుడిగా వ్యవహరించినందుకు పెందోట బాలసాహిత్య పురస్కారం అందజేశారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో షఫికి నగదు బహుమతితోపాటు పురస్కారంతో సన్మానించారు. జిల్లాలో బాల సాహిత్య విస్తరణకు తన వంతు కృషి చేస్తానన్నారు. కథలురాసిన బాలలకు, ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెందోట బాలసాహిత్య పురస్కారం నిర్వాహకులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాల రద్దుపై పోరాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సత్తుపల్లి, జూన్ 30: కార్మిక చట్టాలను రద్దు చేస్తున్న పాలకులకు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకన్న పిలుపునిచ్చారు. మండలంలోని రుద్రాక్షపల్లి గ్రామంలో ఆదివారం సత్తుపల్లి ఏరియా 5వ మహాసభ, ముందుగా ర్యాలీ జరిగాయి. ఆయన మాట్లాడుతూ.. యాజమాన్యాలు, వ్యాపార వర్గాల దయాదక్షిణాలపై కార్మికులు ఆధారపడేలా చట్టాలను, విధానాలు పాలకులు రూపొందిస్తున్నారని విమర్శించారు. వీటిని కార్మికవర్గం చైతన్యవంత పోరాటాలతో తిప్పికొట్టాలన్నారు. ఏరియా కమిటీని ఈ మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అధ్యక్షుడిగా ధరావత్ కృష్ణ, కార్యదర్శిగా అమర్లపుడి శరత్, ఉపాధ్యక్షులుగా చింతం కృష్ణ, సూరిబాబు, సహాయ కార్యదర్శులుగా బొద్ద వెంకటేశ్వరరావు, ధరావత్ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా రాము ఎన్నికయ్యారు. అమర్లపుడి శరత్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో నాయకులు పుల్లయ్య, నాగిరెడ్డి, దుర్గ, వెంకటేష్, ధరావత్ వెంకటేశ్వరరావు, శ్రీను, గరిక వెంకటేశ్వరరావు, రాజా తదితరులు పాల్గొన్నారు.